గెలగిల

- గిట్టుబాటు కాని అరటి
- జిల్లాలో 12 వేల ఎకరాల్లో సాగు
- కొవ్వూరు డివిజన్‌లో అధిక విస్తీర్ణం
- 900 ఎకరాల్లో టిష్యూ కల్చర్
- పెట్టుబడులు రావడం కష్టమంటున్న రైతులు
- ఎకరాకు రూ.1.10 లక్షల ఆదాయం

దేవరపల్లి: అరటి సాగు గిట్టుబాటు కాక రైతులు గిలగిలాడుతున్నారు. పండించిన అరటి గెలలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన చెందుతున్నారు. పండ్ల తోటల పెంపకంలో భాగంగా డెల్టాతో పాటు మెట్ట ప్రాంతంలో సాగు నీటి లభ్యత ఉన్న భూముల్లో రైతులు అరటి సాగు చేస్తున్నారు. కర్పూర, చక్కెరకేళి, పచ్చ అరటి (టిష్యూ కల్చర్) రకాలను ఈ ప్రాంతంలో సాగు చేస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో అధిక విస్తీర్ణంలో అరటి సాగు జరుగుతోంది. కొవ్వూరు, చాగల్లు, పెరవలి, తాళ్లపూడి, ఉండ్రాజవరం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని సుమారు 12 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతోంది. 900 ఎకరాల్లో టిష్యూ కల్చర్ సాగు చేస్తున్నారు. కొంత మంది కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా అరటి సాగు చేస్తున్నారు. రెండేళ్లలో మూడు పంటలు పండిస్తున్నారు. ఎకరాకు 1,100 నుంచి 1,200 మొక్కలు వేస్తున్నారు. విత్తనం పిలకలను కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి తీసుకువస్తున్నారు. పలువురు కౌలుకు భూములు తీసుకుని అరటి పంట వేస్తున్నారు.

రైతుకు తక్కువ.. వ్యాపారులకు ఎక్కువ

మొక్క వేసిన తర్వాత 9 నుంచి 10 నెలల్లో దిగుబడి వస్తోంది. ఇక్కడ పండించిన అరటిని పశ్చిమ బెంగాల్, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసి వ్యాపారులు సొమ్ము చేసుకుంటూండగా.. తమకు ఇస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. పచ్చ అరటి గెల 25 నుంచి 30 కిలోల బరువు వస్తోంది. దీనిని రైతులు కిలోల చొప్పున విక్రయిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చ అరటి ధర రూ.10 నుంచి రూ.12 వరకూ పలుకుతోంది. కర్పూరం, చక్కెరకేళి రకాలను గెలల చొప్పున విక్రయిస్తారు. కర్పూర గెల రైతు వద్ద రూ.170 వరకూ పలుకుతూండగా.. వ్యాపారులు రూ.300 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. చక్కెరకేళీ గెలకు రూ.220 వరకూ వస్తోందని రైతులు చెబుతున్నారు. మొత్తంమీద పండించిన రైతు కంటే వ్యాపారులకే ఎక్కువ లాభం వస్తోందని రైతులు వాపోతున్నారు.



కొవ్వూరు మండలం దొమ్మేరులో సాగులో ఉన్న అరటి తోట



కర్పూర అరటి గెల



అరటి గెలలను మార్కెట్‌కు తరలిస్తున్న కౌలు రైతు

మండలాల వారీగా అరటి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

మండలం	సాగు విస్తీర్ణం
కొవ్వూరు	2,895
చాగల్లు	621
తాళ్లపూడి	710
ఉండ్రాజవరం	2,065
పెరవలి	4,921
దేవరపల్లి	110
నల్లజర్ల	60

దళారులకే లాభం



ఏడాదికి మూడు పంటలు పండించవచ్చు. ఎకరాకు రూ.1.20 లక్షల ఆదాయం వస్తోంది. ఎకరం కౌలు రూ.50 వేలు, పెట్టుబడి రూ.లక్ష అవుతోంది. అరటి పంట రైతుల కంటే దళారులకే లాభంగా ఉంది. దళారులకు 10 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇప్పుడిప్పుడే మార్కెట్లో ధర పెరుగుతోంది. మొన్నటి వరకూ గెల ధర రూ.60 నుంచి రూ.70 వరకూ ఉండగా, ప్రస్తుతం రూ.106 నుంచి రూ.170 పలుకుతోంది. ఈ ధర రైతుకు గిట్టుబాటు కాదు. వ్యాపారుల వద్ద గెల రూ.300 నుంచి రూ.400 వరకూ పలుకుతోంది. గెల ధర రూ.300 ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుంది.

– కలగర అమ్మిరాజు, రైతు, కురుకూరు, దేవరపల్లి మండలం

టిష్యూ కల్చర్‌పై ఆసక్తి



ఎక్కువ మంది రైతులు టిష్యూ కల్చర్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ పండించిన పంటను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎకరాకు 1,000 నుంచి 1,100 గెలలు వస్తాయి. రైతులు ఏడాదికి రెండు మూడు పంటలు పండిస్తున్నారు. వివాహాలు, పూజల సమయంలో మంచి ధర పలుకుతుంది.

– బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, రాజమహేంద్రవరం

తహసీల్దార్ రాజ్యలక్ష్మికి ఘనంగా వీడ్కోలు



తహసీల్దార్ రాజ్యలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు, జేసీ చిన్నరాముడు

దేవరపల్లి: ఉద్యోగ విరమణ చేసిన దేవరపల్లి తహసీల్దార్ కేతా రాజ్యలక్ష్మి, వెంకటరెడ్డి దంపతులను ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు ఆదివారం ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. స్థానిక కరుటూరి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సత్కార సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు భారీగా తరలి వచ్చారు. రెవెన్యూ శాఖలో రాజ్యలక్ష్మి దాదాపు 40 ఏళ్లు విశేష సేవలందించి, ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ, పరిపాలనలో రాజ్యలక్ష్మి అందరి మన్ననలూ పొందారని అన్నారు. సమాజాభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగుల సేవలు అవసరమని, వారి కోసం నియోజకవర్గ స్థాయిలో భవనం నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కె.సుధారాణి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్



దేవరపల్లి: స్థానిక తహసీల్దార్‌గా ఎం.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనను తహసీల్దార్‌గా పూర్తి అదనపు (ఎఫ్ఏసీ) బాధ్యతలతో నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కె.రాజ్యలక్ష్మి గత నెల 28న ఉద్యోగ విరమణ చేశారు.

మహిళలను గౌరవించాలి



పోలీస్ స్టేషన్ పనితీరును వివరిస్తున్న సీఐ విజయ శంకరం

నల్లజర్ల: మహిళలను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయమని సీఐ విజయ శంకరం అన్నారు. పోలీస్ స్టేషన్ పని తీరుపై నల్లజర్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థినులకు ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ వరకూ వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోలీసు విధులతో పాటు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఏవిధంగా ఎదుర్కోవాలో విద్యార్థినులకు వివరించారు. సమాజం మేలు కోసం త్యాగాలు చేసిన మహిళా మూర్తులను ఆదర్శంగా తీసుకొని, నేటి మహిళా లోకం ముందుకు సాగాలని అన్నారు. మహిళల అభివృద్ధితోనే సమాజంలో పటిష్టమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆలయాలు, చర్చిల వద్ద లౌడ్ స్పీకర్లు లేకుండా చూడాలని అన్నారు. విద్యార్థుల చదువులకు భంగం కలిగించేలా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కల్యాణం.. కమనీయం



ప్రక్కిలంకలో సూర్యనారాయణమూర్తి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- వైభవంగా సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణం
- వేలాదిగా వీక్షించిన భక్తులు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకలో సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. మాఘమాసం సందర్భంగా నిర్వహిస్తున్న 16వ సౌరయాగం ముగింపును పురస్కరించుకుని స్వామివారి కల్యాణం జరిపారు. ఉదయం నుంచి వేదపండితులు కొతవరపు విశ్వనాథశర్మ, సాయి, ధనుంజయ్ ఆధ్వర్యంలో స్వామి, వారికి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ క్రతువును పూర్తి చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా నెల రోజుల పాటు స్వామివారికి విశేష పూజలు, హోమాలు చేశారు. ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, రథోత్సవం, హోమం, గోపూజ నిర్వహించారు. సూర్యనారాయణమూర్తిని పుష్పాలు, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రక్కిలంక, తాళ్లపూడి, పైడిమెట్ట గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. శశిశేఖర మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు: పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన దొనెల ఆంజనేయులు (47) కలుపు మందు తాగి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రూరల్ ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు. అప్పుల బాధ తాళలేక గత నెల 14న కొవ్వూరు మండలం మద్దూరులంకలోని పొలాల్లో మద్యంలో కలుపుమందు కలుపుకుని తాగాడు. కాగా ఆంజనేయులు కొబ్బరి బొండాల వ్యాపారం చేయడంతో పాటు ఫైనాన్స్‌పై వ్యాన్ కొనుగోలు చేసి అద్దెకు నడుపుతున్నాడు. ఇటీవల నష్టం రావడంతో అప్పులపాలై కలుపు మందు తాగాడు. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేదు. కాగా గత నెల 18న నోటి పూత రావడంతో తొలుత తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా కలుపుమందు సేవించిన విషయం తెలిపాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య గంగారత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

చాగల్లు: మండలంలోని చిక్కాల గ్రామంలో నూతనంగా నిర్మించిన విజయగణపతి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పండితులు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, క్షీరాధివాసం, నీరాజన మంత్ర పుష్పములు, మండప పునఃపూజలు, నవరత్నములు, ఆకర్షణ, మంత్ర స్థాపన, చతుర్వేదస్వస్తి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

తాళ్లపూడి: మహాశివరాత్రి పర్వదినం నాడు తాడిపూడిలో పుణ్యస్నానాలకు వెళ్లి గోదావరిలో మునిగి మృతి చెందిన ఐదుగురు యువకుల కుటుంబాలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్త సాయి, అనిశెట్టి పవన్ గణేష్, గర్రే ఆకాష్, తిరుమలశెట్టి పవన్ కుమార్‌ల కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చూస్తానని చెప్పారు.

'కూచిపూడి'లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

నిడదవోలు: కూచిపూడి నృత్య ప్రదర్శనలో నిడదవోలు పట్టణానికి చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సంగీతం, నృత్య ప్రదర్శనలు చేశారు. నిడదవోలు భ్రామరి కూచిపూడి నాట్య నిలయం విద్యార్థుల కూచిపూడి ప్రదర్శనకుగాను మిరాకిల్ వరల్డ్ వారు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో భ్రామరి కూచిపూడి నాట్య నిలయం వ్యవస్థాపకుడు, శిక్షకురాలు పి.పావని తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

నిడదవోలు: పట్టణంలో విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ఆదివారం 33 కేవీ విద్యుత్ లైన్‌లో హెవీ విద్యుత్ ప్రధాన రోడ్డుపై విద్యుత్ తీగ తెగి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తిరిగి తెగిపడిన విద్యుత్ తీగను పునరుద్ధరించారు.



తెగిపడిన విద్యుత్ తీగను పునరుద్ధరిస్తున్న విద్యుత్ సిబ్బంది

క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఎస్పీ దంపతులను అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: పుల్లలపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడు తాడిగడప ధర్మయ్య, సోమాలు దంపతుల కుమారుడు మురళి, ఉమల వివాహ వేడుకలో మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత ఆదివారం పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షులు చిన్నీ నాగూ యాదవ్, తాడిగడప శ్రీనివాసరావు, సర్పంచ్‌లు అల్లూరి సూర్యచంద్రరావు, చెల్లారి రామ శ్రీనివాస్, పలువురు నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాటకూటేశ్వరుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



కాటకోటేశ్వరంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరంలో ఉమాకాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని, పార్వతీదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తాళ్లపూడి: గ్రామీణ ప్రాంతాల్లో సైతం కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు సాయిస్ఫూర్తి ఆసుపత్రి సీఈవో గూడా విజయరాజు తెలిపారు. మండలంలోని గజ్జరంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లపూడిలోని సాయిస్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పి.సీతాభారతి, ఎ.డేవిడ్‌రాజు, విటీజీ వర్మ రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మొత్తం 110 మందికి వైద్య పరీక్షలు చేసి దాతల సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌గండి రాంబాబు, ఉప సర్పంచ్ డి.శేషు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



గుబ్బల మంగమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం శివార్లలో నిర్మించిన గుబ్బల మంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాముళ్లపల్లి ఆనంద్ శివాచార్యులు ఆధ్వర్యాన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద హోమం, కుంకుమ పూజలు, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, నందిగూడెం, రాంపాలెం, భీమోలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కవితకు మాజీ మంత్రి వనిత పరామర్శ



కవిత తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: మాతృవియోగంతో బాధ పడుతున్న మండల మాజీ మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవితను, ఆమె భర్త, సగ్గొండ సర్పంచ్ శేఖర్‌లను రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. కవిత తల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పటాన్ అన్సర్ బాషా, ఉక్కుసూరి సురేష్, చాపర రమేష్ తదితరులున్నారు.

శివాలయాల్లో విశేష పూజలు

చాగల్లు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాగల్లు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మహిళలు ఆలయాల్లో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించారు.

అన్నసమారాధన

చాగల్లు: శివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ధారవరం, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. మాజీ డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మరిన్ని పదవులు పొందాలి



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

గోపాలపురం: నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్‌ను వైఎస్సార్ సీపీ భీమోలు నాయకులు ఆదివారం సత్కరించారు. చిన్న వయస్సులో నియోజకవర్గ బాధ్యతలు చేపట్టి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న శ్రీనివాస్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. లూథరన్ చర్చిలో జరిగిన ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జార్జి శామ్యూల్, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ నాయకులు నరేంద్ర, వీరేష్, రామకృష్ణ, ఎం.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



యర్నగూడెం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

దేవరపల్లి: యర్నగూడెంలోని హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ వద్ద ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని పూర్వ విద్యార్థులు బి.ఇందిర, కె.బ్రహ్మణి ప్రారంభించారు. ఎండలు పెరుగుతున్నందున ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. జూన్ నెల వరకూ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి తిరుపతి ప్రసాద్, సభ్యులు ఆంజనేయులు, చంద్రశేఖర్, మురళి, బి.వెంకన్న, కె.దుర్గారావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.